రట కరణంగారు. ఆయనకిలాంటి దౌర్జన్యాలంటె యిష్టంలేకపోయినా మునసబుగదా అని వూరుకుండేవారు. కాకపోయినా మునసబు తప్పతాగి యింటిమీదికొచ్చి పోలుతూండేవాడు. వాడిరహస్యాల్ని బయటపెడితే ఎంతపనికేనా సెట్టుకుంటాడేమోనని భయం. కాని యిప్పుడు వీరయ్య విషయంలో నిక్కచ్చిగా చెప్పేశారు. వీరయ్యమీద అమ్మగారిక్కూడా అభిమానంవుండేది. ఓమాటు బంగారపు గొలుసు తెగిపోయి నూతిదగ్గర బురదలో దొరికితే అమ్మగారికి పట్టుకెళ్ళి ఇచ్చేశాడు. అప్పటినుండి వీళ్ళమీద మరీ నమ్మకమూ అభిమానమూ కలిగేయి వాళ్ళకి.

మునసబుకి కరణంగారిమీద మరీకోపం వచ్చి "అయ్యా కరణంగారూ! నా మీద కెదురు తిరిగినోణ్ణిమీరు చేరదీస్తున్నారు జాగ్రత్తసుమండీ" అని బెదిరించి పళ్ళు కొరుకుతూ వెళ్ళిపోయాడు. అప్పటినుండీ మునసబుగారికీ, కరణంగారికీ దెబ్బలాటలు బయలుదేరుతున్నాయి. కరణంగార్ని యెలాగన్నా సాధించుదామని నిశ్చయించుకున్నారు మునసబుగారు.

వీరయ్యమాత్రం ఎప్పుడూ ధైర్యం చెపుతూ వుండేవాడు కరణంగారికి.

ఓనాడు సాయంత్రం దీపాలవేళవుంటుంది. కరణంగారింటిముందు పోలీసోళ్లు పదిపదిహేను మంది, యింకా మన వూరోళ్లమూగేరు. ఏంటో అని నేనుకూడా వెళ్ళాను. తీరాచూస్తే వీరయ్యని పోలీసులు పట్టుకుని లెంపలు వాయిస్తున్నారు; ఎందుకో అనుకున్నాను. మునసబుగారు వాడిమీద కేసుపెట్టినాడట, వూళ్ళో ధాన్యం ప్రొక్యూరుమెంటుకి యివ్వకుండా చేస్తున్నాడని.

"నాకు తెలీదు బాబో—"అని వీరయ్య గోలపెడుతున్నా వూరుకోకుండా ముఖంవాచిపోయేట్లుకొట్టి తీసుకుపోయారు. కరణంగారు ఎంతచెప్పినా వినలేదువాళ్లు. మునసబునాయుడు వాళ్ళతో వెళ్ళాడు. ఊరవతల మునసబు నాయుడి కళ్ళంలో రాత్రి మకాంవేశారు, చాలసేపు. రెండు గొర్రెపోతుల మాంసం, ఎన్నో సారాసీసాలూ అవన్నీ ఖర్చయినట్లు మర్నాడు చెప్పాడు, వాళ్ళ పాలేరుగావున్న మన సీతయ్య. ఆ అర్ధరాత్రి వీరయ్యని పోలీసువాళ్లు తీసుకుపోయారట.

మూడురోజులవరకు వాణ్ణి వొదల్లేదు. ఆ తరవాత వాడు బాగా చిక్కిపోయి, నల్లబారిపోయి వచ్చాడు. ఒంటినిండా దెబ్బలుబాగా అవుపించాయి. రక్తపుచారలు ఎండిపోయి, ఒళ్ళంతా అసహ్యంవేసేటట్లు అయిపోయింది. నెలరోజుల దాకా మనిషి లేవలేకపోయాడు.

అప్పటినుండీ వూళ్లోకి ఎవరన్నా పోలీసు వాళ్లు వస్తే అలా మూర్ఛపోయినట్టు పడిపోతూంటాడు. బాగా ఒడిలిపోయాడు మనిషి. పెళ్ళాం సీతమ్మ, కూలిచేసి తెచ్చిపెడుతూంటుంది. ఏపనీ చెయ్యలేడు. కరణంగారు అప్పుడప్పుడు ఏమేనా గింజలూ, డబ్బూ యిస్తుంటారు. చూడు నాయనా, పోలీసువాళ్ళూ మునసబుగారూ ఎంతో అన్నదమ్ముల్లా తిరుగుతూంటారు! అసలు వీరయ్య వీధిలోకి రావడమే మానుకున్నాడు."

ముగించింది పెద్దమ్మ కథని. కళ్లంట బొటబొటా కన్నీరు కారింది పెద్దమ్మకి. చూస్తూ అలా వుండిపోయాను.

స్కెచ్

# శేషయ్యగారి హాస్యం

కె. రామలక్ష్మి

పార్లమెంటు సభ్యుడు శేషయ్యగారు ప్రజాప్రతినిధుల సభలో నిలువెత్తునా నిలబడి అమరత్వం పొందదగిన ఓ హాస్యపూరితోపన్యాసాన్ని యిచ్చేశాడు. ఆ వేళ మీటింగులో ఎక్కువమంది సభ్యులూలేరు-అయినా శేషయ్యగారి "హాస్యం" ఉన్న కొద్దిమందినే ఉత్తేజపరిచింది. ఉపన్యాసం అంతకీ ఏంగాని, ఆయన రాయలసీమవాసుల వివిధముఖాభివర్ణన వినితీరవలసిందే. అనుకోకుండానే ఆయన ఆ ధోరణిలో పడ్డారు. అర్ధనిమీలితనేత్రుడైన ఓ సభ్యుడు

తాను సుషుప్తావస్థలో వున్నాడనుకుంటారేమోనని, ఓ నవ్వు (అర్థవిహీనంగా) పారేశాడు. మరునాటి వార్తాపత్రికలో, పార్లమెంటుసభ్యుడు శేషయ్యగారి ఉపన్యాసంతోపాటు, మీసాల బ్రేకట్లమధ్య "ఓ నవ్వు" అని కూడా పడింది. రాజకీయవార్తలు ప్రమాదంలేనివనీ, ప్రమాదించినా క్షమాపణ వేడడం సులభమనీ, యిష్టమొచ్చినట్లు ప్రచురించి పేరు సంపాదించిన ఓ దినపత్రిక—మీసాల బ్రేకెట్లమధ్యనే "నవ్వేరు" అని ప్రచురించింది. బహుశా వారి రిపోర్టరు ఆ సమయంలో లక్షణంగా నిద్రిస్తున్నాడేమో—హాయిగావుండే ఆ పార్లమెంటరీ భవనంలోని సోఫాలమీద.

* * *

"మీ అల్లుడు పార్లమెంటులో ఎంత హాస్యపూరితంగా మాట్లాడేరో చదివావా?" అని శేషయ్యగారి భార్య తల్లిని అడిగింది. "ఇన్నాళ్లుగా కాపరంచేస్తున్నామేకాని, ఇంట్లో ఒక్కసారి ఏ విసురేనా పడేసి నవ్వుకున్న పాపాన్ని పోలేదు. మరి యింట్లో ఆముదంముఖం అక్కడెలా వికసించిందో!...అయినా ఇదంతాచూస్తే మా యిద్దరిమధ్యా అపస్వరాలు బయలుదేరేలాగా వుంది" అంది చాలా సీరియస్‌గానే. "అపస్వరాలేమిటే? ఇదేమేనా సంగీతమా?" అంది ముసలి తల్లి—పార్లమెంటరీ సభ్యుడు శేషయ్యగారి భార్య హృదయంలోని ఆవేదన అర్థంచేసుకోలేక.

"ఆఁ ఏదో కవితాదృష్టితో అన్నా—అంటె తేడాలువచ్చేలా తోస్తోందని" శేషయ్యగారి భార్య ఏదో ఆలోచనలోవుండే అంది. ఏ మాటేనా తర్కంలోకి దారితీసే సూచనలు గోచరిస్తే, దానికి కవితాదృష్టి నాపాదించడం శేషయ్యగారిదగ్గరనుండే ఆమె నేర్చుకుంది. పార్లమెంటు సమావేశాల్ని తన హాస్యపూరిత ధోరణే ఉద్ధరించగలదని నమ్ముతూ, వాటిని అలంకరిస్తున్నారు శేషయ్యగారు.

"దేశంఅంతా ఎంత పచ్చపచ్చగా వుంది! అయినా, అది వున్నది అందుకేగా" అన్నారు భోజనంచేస్తూ, ఎదుటి కిటికీలోంచి కనిపించే ప్రకృతిని తిలకిస్తూ శేషయ్యగారు.

"ఆ విషయం కొత్తగా చెప్పడం దేనికి? అందరికీ తెలిసిందే!" అంది శేషయ్యగారిభార్య. ఆయన ఆవేశపూరితమైన ఊవాచకు చన్నీళ్లు పోసం కాస్త ఆలోచించి చూస్తే, ఆవిడ కొంచెం ఉదారంగా ప్రవర్తించేదేమో కాని ఏం చేస్తాం? సాధారణంగా మానవప్రయత్నమంతా పైకి కనిపించకుండానూ, అంతుపట్టకుండానూ పని చేస్తుంది. శేషయ్యగారేమీ సమాధానం యివ్వలేదు—దీనికి కారణం దెబ్బతిన్న ఆయన అహంభావముకాదు. ఇంకోమాట అనేముందు ఆయన మునిగిపోయే ఆలోచనా సముద్రమే. శేషయ్యగారి భార్య ఆయన నిశ్శబ్దాన్ని అపార్థం చేసుకున్నారు. "చిన్నవాళ్ళ మాటల్ని సహనంతో భరించే ఘనుణ్ణి" అనుకున్నారేమో పార్లమెంటరీ సభ్యుడైన శేషయ్యగారు, అనుకొని ఆయనభార్య వూరుకోలేకపోయారు.

"మీరు నాదగ్గర అన్నమాటే, మీతో కూర్చునే ఆ పార్లమెంటు సభ్యురాలిదగ్గర అని వుంటే, ఆవిడకి బాగా అర్థమై ఆనందించేది" అంది-నూటికిపోటీ ధోరణిలో. అప్పటిలో ఆవిడ దృష్టిలో మెదిలిన ఆ సభ్యురాలు-బహు ముఖమైన ప్రజ్ఞలుగలది. అర్థరాత్రీ అపరాత్రీ అనక, సంఘ సంస్కరణకోసం పాటుపడి, ఉపన్యాస రూపంలో సంస్కరణ సూత్రాలను అమల్లో పెట్టిన మేటి సంఘ సంస్కర్త.

భోజనాల అనంతరం..."మా యిద్దరిమధ్యా అపస్వరాలు, అగాధంగా మారేలావున్నాయి." అంది విచారంగా శేషయ్యగారి భార్య ముసలి తల్లితో.

"ఈ విషయం అందరికీచెప్పుకోవలసిందికదు" అనుకుంది ముసలావిడ. ఆవిడ దృష్టిలో అపస్వరాలే అర్థంలేనివైనప్పుడు అగాధానికి చోటేవుండకపోవడంలో ఆశ్చర్యంలేదు.

శేషయ్యగారిభార్యకి జీవితంలోశాంతిలేకుండాపోయింది. ఏవో తెలియని విషాదఛాయలు ఆమెనావరించాయి. పుస్తకమేదైనా చదువుదామంటే, ప్రభుత్వకరపత్రాలూ, తదితర ప్రభుత్వముద్రణలూ "వనమహోత్సవం" అనే మహాకావ్యరాజమూతప్ప యింకేమీలేవు శేషయ్యగారి లైబ్రరీలో. వృక్షాలు భూదేవికి అలంకారమని యిప్పుడు వాళ్లుచెప్పేదేమిటి? నాటినవారి సహృదయమో, మరేమో, ఉత్సవప్రారంభంలోనాటిన ఏ మొక్కా ఆయురారోగ్యాభివృద్ధినిగాంచలేదు. ఇదంతా

ఎందుకొచ్చినగొడవ అని, రాత్రి వంటమీదికి దృష్టిని మరల్చింది శేషయ్యగారిభార్య. వింతైన దేమైనా వండితేనైనా, హాస్యపూరితధోరణి(అదే ఆమెని రోజుకిరోజు క్రుంగతీస్తోంది.)లోనుంచి యీ సాధారణ మానవధోరణిలో పడతారేమో అని తలపోసింది.

రాత్రి భోజనం చేస్తూ, ఓ ప్రఖ్యాత రాజకీయ వేత్తపేరు ఎత్తింది, ఎందుకో తెలియకుండానే శేషయ్యగారిభార్య.

"ఆ. ఆయనది పంచదారచిలుక హృదయం" అన్నారు నవ్వుతూ పార్లమెంటరీ సభ్యుడు శేషయ్యగారు.

"పంచదార చిలుకకి హృదయాలేమిటి నాయనా?"అంది శేషయ్యగారి అత్తగారు.

"లేకుంటేనే మంచిది. ఉంటే అస్తమానూ పోగొట్టుకుంటూనేవుంటారు. అది అందరికీఅవస్థ" అన్నాడు శేషయ్యగారి ముద్దుల మేనల్లుడు.

"కొంచెం కూర బాగావండడం నేర్చుకుంటే బాగుండును"అన్నారు శేషయ్యగారు, పైరిమార్కు లేమీ విననట్టుగానే. అంతేకాదు. కొంచెం కోపం గానూ మోటుగానూకూడా అన్నారు.

ఆయన ధోరణి దారితప్పినందుకు భార్యముఖం వికసించింది.

మళ్ళీ రాయలసీమను గుఱించిన వాద ప్రతి వాదనలలో కాబోలు శేషయ్యగారు, తనహాస్యం ద్వారా అఖండ ఖ్యాతిని గడించారు. (అప్పటి పార్లమెంటరీ సెషన్‌లో) "రాయలసీమవాసులు తాము జీర్ణించుకోలేని చరిత్ర సృష్టించారు." అన్నారు శేషయ్యగారు - నవ్వుతూ పార్లమెంటులో. అసలే విసిగించేఉపన్యాసాల మధ్య-యిది సభ్యులను నవ్వించింది. జ్ఞాపకశక్తి తప్పదారులను ఒట్టిన ముసలి సభ్యులందరూ కరతాళధ్వనులు చేయడమే కాకుండా, ఇంగ్లండులో డిజ్‌రెలీ ప్రభుత్వం జ్ఞాపకం వచ్చిందన్నారు. దీనికీ శేషయ్యగారి మాటకీలాగే విలువలేదని లోలోపలే కొందరు సభ్యులు అనుకుని నవ్వుకున్నారు.

శేషయ్యగారి భార్యకి పార్లమెంటు సెషన్స్ జరుగుతున్నప్పుడు, వార్తాపత్రికలు చూడ్డం అంటేనే భయం. అందుకే ప్రస్తుతంలో ఆవిడ జాగ్రత్తగా పేపరు చూడటం మానేసింది. కాని, పాపం పొరుగింటి కౌన్సిలర్‌గారి భార్య చెప్పింది- శేషయ్యగారి అద్భుతవాక్యం గురించి.

"బాగుంది. ప్రస్తుతానికి సంబంధించిందేకనక, మాంచి తెలివితేటలు కనపరుస్తోంది" అంది శేషయ్యగారి భార్య ముభావంగా.

"నిజమే. చూశారూ ఆ సంఘసంస్కర్త పార్లమెంటరీ సభ్యురాలు అనే ప్రతీమాటా తెలివితేటల్ని వెదజల్లుతూనే వుంటుంది. కాని, కొట్టినపిండేగా" అంది అతి నెమ్మదిగా కౌన్సిలర్ గారి భార్య.

"అయితే ఆవిడగారిదేనా యీ వాక్యం కూడా?" అంది శేషయ్యగారి భార్య.

"అయ్యోరామా! ఒకసారీ రెండుసార్లూ కాదండీ-ఓ డజనుసార్లైనా వినుంటాను ఆవిడ నోటంట!"అంది కౌన్సిలర్‌గారి భార్య నవ్వుతూ.

"అయితే మావారి హాస్యానికి ప్రాతిపదిక ఆవిడే నన్నమాట!" అంది శేషయ్యగారి భార్య. ఎందుకో ఆవిడ ముఖం ముడుచుకుపోయింది.

అప్పటి పార్లమెంటు సమావేశం పూర్తి కాకుండానే పార్లమెంటరీసభ్యుడు శేషయ్యగారి భార్య అకాలమరణానికి గురి ఐంది. గుండెనొప్పి భరించలేక నిద్రమందు పుచ్చుకుని ఆ యిల్లాలు శాశ్వత నిద్రచెందింది. పార్లమెంటు సభ్యుడు శేషయ్యగారికి ఏమీ అర్థంకాలేదు. నిద్రమందు అసలెందుకు తింటోందో, ఇప్పుడెక్కువ ఎందుకు తిన్నదో ఆయన కంతుచిక్కలేదు. విషాదకరమైన విషయం ఏమిటంటే, భార్యపోయిన బాధకంటే, అత్యుత్తమహాస్యానికి తావిచ్చే అమూల్య అవకాశం పోయినందుకు పార్లమెంటరీ సభ్యుడు శేషయ్యగారు విచారించారు. సానుభూతులు అందుకొని సమాధానంగా, హాస్యపూరితమైన ఓ విసురు విసిరితే పార్లమెంటులోని సమస్త సభ్యులూ ఆయనగుండె నిబ్బరానికి ఆశ్చర్య చకితులై వుండేవారని, శేషయ్యగారు యిప్పటికీ విచారిస్తునేవున్నారు. ముసలావిడమటుకు అల్లుని పార్లమెంటరీసభ్యత్వం తన కూతుర్ని పొట్ట పెట్టు కుందని కుములుతూంటుంది.